www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 అక్టోబర్ 2024
5
చిత్తూరు



ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సాంఘిక సంక్షేమ శాఖ తరపున ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు మెగా డీఎస్సీలో ఉచిత శిక్షణ కోసం ఆన్లైన్లో దరఖాస్తు గడువు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ సహాయకులు నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మెగా డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత భోజనం వసతి సౌకర్యాలతో ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్ పరీక్షల నిమిత్తం ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీ లోపు జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మామిడి గుజ్జు పరిశ్రమల సమస్యలు పరిష్కరించండి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మామిడి గుజ్జు పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు రాబోవు సీజన్లో మామిడికి గిట్టుబాటు ధర లభించేలా మామిడి గుజ్జు పరిశ్రమల యజమానుల సమాఖ్య నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల సమస్యలను అలాగే మామిడి రైతులకు గిట్టుబాటు ధర వంటి అంశాలను కలెక్టర్‌తో చర్చించారు. ఈ సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో రెండు వేర్వేరు చోట్ల చిరుతలు మృతి



పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

- వేటగాళ్ల ఉచ్చులో పడి ఒకటి, ప్రమాదవశాత్తు మరొకటి
- కనుమరుగవుతున్న వన్యప్రాణుల రక్షణ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ ఆవులపల్లి సెక్షన్ రాంపల్లి బీట్ చెరువుకొన రిజర్వ్ ఫారెస్ట్‌లో సోమవారం మృతి చెందిన చిరుత పులి కళేబరాన్ని గ్రామస్తులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పశువైద్య సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించారు. జిల్లా అటవీశాఖ అధికారిని భరణి తెలిపిన వివరాల మేరకు.. రిజర్వు ఫారెస్ట్‌లో ఆహారం కోసం సంచరిస్తున్న ఓ మగ చిరుత ప్రమాదవశాత్తు 20 మీటర్లలోతైన ఇరుకైన వంకలో పడిపోవడంతో తల పగిలి మృత్యువాత పడ్డట్టు తెలిపారు. అటవీ సిబ్బంది సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని తిరుపతి జూపార్క్ వైద్యులు స్థానిక పశువైద్యులు ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి అవసరమైన కళేబరంలోని అవయవాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించడం జరిగిందని తెలిపారు. పోస్టుమార్టం నివేదికలు అందిన తర్వాత పూర్తి సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుందన్నారు. మృతి చెందిన చిరుత కళేబరాన్ని అక్కడే దహనం చేశామని అన్నారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీరాములు, పుంగనూరు ఎఫ్ఎస్ఓ ఇంద్రాణి, ఆవులపల్లి ఎఫ్‌బిఓ షాజహాన్, మహేష్, పశువైద్య సిబ్బంది, వీఆర్వో శివకుమార్, విఎస్ఎస్ సభ్యులు రమణ గురుస్వామి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలి గోళ్లు, పళ్లు పీకిన వేటగాళ్లు..



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

యాదమరి: యాదమరి మండలం తాళ్లమడుగు కౌండన్య అటవీ ప్రాంతంలో కొద్దిరోజుల క్రితం చిరుత పులి మృతి చెందింది. వేటగాళ్లు చిరుత పులి నోటిలోని పళ్లు, పంజాలోని గోర్లు పీకి వేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి లావణ్య తెలిపారు. ఆదివారం ఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు, యాదమరి ఎస్ఐ ఈశ్వర్ యాదవ్, ఫారెస్ట్ రాజగోపాల్ కుళ్లిన స్థితిలో ఉన్న చిరుత కళేబరాన్ని పరిశీలించారు. అనంతరం తిరుపతి జూపార్క్ వైద్యులు, స్థానిక వెటర్నరీ డాక్టర్లు చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత మృతిగల కారణాలను పరిశీలిస్తున్నామని, చిరుత మృతికి వేటగాళ్ల వేసిన ఉచ్చు, రైతులు పంటపొలాలకి పెట్టిన విద్యుత్ తీగలు కారణమా లేక అనారోగ్యంతో మృతి చెందిందా అన్న వివరాలు దర్యాప్తులో తెలియాలని తెలిపారు.

అయ్యా.. మా సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌కు యానాదుల విన్నపం


ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌లో యానాదులు అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిస్కార వేదికలో యాదమరి, చౌడేపల్లి, తవణంపల్లి, వెదురుకుప్పం మండలాలకు చెందిన గిరిజనులు ప్రజలు, వివిధ రకాల సమస్యలకు సంబంధించి కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరికు సమస్యల అర్జీలను అందజేశారు. యాదమరి మండలం, మాపాక్షి షికారి కాలని ఎస్టీలు తమ దగ్గర ఎప్పటి నుంచో తుపాకులు ఉన్నాయని వాటికి లైసెన్స్ కోసం గతంలో అధికారులకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఇంకా లైసెన్సులు రానందున తాము తుపాకులు వాడటం లేదని ఎంత చెప్పినా వినకుండా ఉదయం 6గంటలకు ఎస్ఐ వచ్చి నిద్రపోతున్న వారిని లేపి తుపాకులు తీసుకొని మీరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం పెడితే మీ తుపాకు మీకు ఇస్తామని చెప్పి తీసుకెళ్లి జైల్లో పెట్టడం జరిగిందని కలెక్టరుకు అర్జీని అందజేసి తమపై దయవుంచి తమ వాళ్ళను విడిపించాలని రేఖ, సత్య, తార, రజని, శిరీష, కవిత, ఉష, దివ్య, మహేష్, లీల్లి, మలేష, దీపికలు కలెక్టర్‌కి విన్నవించుకున్నారు. తవణంపల్లి మండలం, మల్లంకుంట పంచాయతీ, రామనాద్ పురం ఎస్టి కాలని వాసులు గత కొన్ని సంవత్సరాలుగా ఊరి నుంచి అడవికి వెళ్లే దారి ఉన్నదని, గత కొన్ని రోజులుగా అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి ఆ దారి గుండా వెళ్లకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని శంకరయ్య, బాలకృష్ణ, బాలాజీ, టి చెన్నమ్మ, ఎం బుజ్జి, ఎస్ విజయ, ఎస్ సంధ్యలు అర్జీని జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. వెంటనే దారి సమస్యను పరిశీలించి పరిస్కారం చేయాలని తహశీల్దార్‌ను ఫోన్ ద్వారా జెసి ఆదేశించారు. చౌడేపల్లి మండలం, శెట్టి పేట పంచాయతీ, గౌను చెరువు ఎస్టీ కాలనీలో సుమారు 15కుటుంబాలు గత కొన్ని సంవత్సరాలుగా ఉన్నామని, తమకు ప్రభుత్వం నుంచి గృహాలు మంజూరు చేయడం జరిగిందని, ఇంటి పట్టాలు ఇవ్వాలని గతంలో కలెక్టర్‌కి, డియల్ఎస్ఏ తహశీల్దార్‌కు అర్జీలు ఇవ్వడం జరిగిందని, ఇంటి పట్టాలు మంజూరు చేయాలనిటి. పాలేటప్ప, డి.అదెమ్మ, ఎస్.సిద్ధప్ప, డి.రాజన్న, ఎస్.వెంకటేష్, గంగులప్ప అర్జీని జాయింట్ కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి జెసి సూచించారు. తవణంపల్లి మండలం కూయ్యవంక ఎస్‌టి కాలానికి చెందిన గంగులమ్మ తమకు ఆధార్ కార్డులో వయస్సు తక్కువ వేశారని తాను మానసికంగా ఎదుగుదల లేక పొట్టిగా ఉండడం తనకు పింఛన్ మంజూరు చేయలేదని, తనపై దయవుంచి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయించాలని కోరుతూ అర్జీని కలెక్టర్‌కు గంగులమ్మ అందించారు. దీనిని పరిశీలించి పెన్షన్ మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. వెదురుకుప్పం మండలం, బొమ్మయ్యపల్లె పంచాయతీ, ఆర్‌కె పురం ఎస్‌టి కాలనీకి చెందిన సి.లక్ష్మి తనకు రెండు చెవులు పూర్తిగా వినపడదని, పెన్షన్ కోసం వెళ్తే సదరన్ సర్టిఫికెట్ తీసుకురావాలని చెప్పడంతో గత సంవత్సరంలో సచివాలయంలో సదరన్ సర్టిఫికెట్ పొందుటకు ఆన్‌లైన్ అప్‌లోడు చేయడం జరిగింది సంవత్సరం అయ్యిన కానీ ఇంతవరకు సదరన్ సర్టిఫికెట్ రానందున నాకు పింఛన్ రావడంలేదని దయచేసి నాకు సదరం సర్టిఫికెట్ కల్పించి పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ సి.లక్ష్మి కలెక్టర్‌కు అర్జీని అందజేశారు. వెంటనే ఈ అర్జీని పరిశీలించాలని డియల్‌డిఓను కలెక్టర్ ఆదేశించారు.



కలెక్టరేట్‌కు వచ్చిన గిరిజనులు

సకాలంలో పీజీ ఆర్ఎస్ వినతుల పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా అందే వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని, పూర్తిస్థాయి విచారణ నివేదికలను సమర్పించాలన్నారు. కార్యక్రమంలో మొత్తం ఇంజనీరింగ్ -4, టీపీవో -1, రెవెన్యూ -1, అకౌంట్స్ -1 చొప్పున మొత్తం 7 వినతులు అందాయి. కార్యక్రమంలో విభాగాల అధికారులు పాల్గొన్నారు.



పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ..

దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

- ప్రజా సంఘాల డిమాండ్



బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: పెద్దపంజాణి మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన నడింపల్లి గ్రామ దళితులపై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్ట్ చేయాలని పలమనేరు ప్రజా సంఘాల జేఏసీ నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమవారం పెత్తందారుల దాడిలో గాయాలై పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల నాయకులు డివి మునిరత్నం, పార్థసారథి, బిఎస్‌పి నాయకులు శివాడి గోవిందు, మహానాడు నాయకులు మంజునాథ్, చంద్ర కుమార్, దళిత మహాసభ నాయకులు శ్రీనివాసులు, జై భీమ్ సంఘం అమర నారాయణ, శివన్న మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వాల్మీకి జయంతి సందర్భంగా అదే గ్రామానికి చెందిన వినోద్‌ను డప్పులు కొట్టాలని పెత్తందారి వర్గానికి చెందిన యువకులు పిలవడంతో డప్పు కొట్టడం తనకు రాదని నిరాకరించిన వినోద్‌పై విచక్షణారహితంగా దాడి చేసి రక్తపు గాయాలు చేయడంతో పాటు, అడ్డొచ్చిన వినోద్ తండ్రి గంగులప్ప, సుబ్బమ్మలను తీవ్రంగా గాయపరచడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కులం పేరుతో తిట్టడంతో పాటు, దళితులను గ్రామంలో నుంచి ఎల్లగొట్టాలని, తమ ఇళ్లల్లో ఉన్న నాటు తుపాకులు తెచ్చి చంపేద్దామనడం దుర్మార్గమన్నారు. ప్రాణపాయంతో బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు పోలీసులు పట్టించుకోకపోవడం ఆంతర్యం ఏమిటని నిలదీశారు. జరిగిన గొడవలకు ప్రధాన సూత్రధారి పెత్తందారైనా దొరస్వామి అని ప్రజా సంఘాలు, బాధితులు బలంగా ఆరోపించారు. ఇప్పటికే నియోజకవర్గంలో దళితులపై విపరీతమైన దాడులు జరిగిన అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం చూస్తుంటే సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి నడింపల్లి దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని లేనిపక్షంలో పోలీస్ స్టేషన్ ముందర బాధితులతో కలిసి నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నవంబర్ 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలకు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను యుటిఎఫ్ నాయకులు ఆహ్వానించారు. జిల్లా కలెక్టరేట్లో సోమవారం కలెక్టర్‌ని కలిశారు. ఈ సందర్భంగా అపార్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారం, నాడు - నేడులో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి విద్యాసదస్సు ద్వారా కృషి చేయడం అభినందనీయమన్నారు. తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరవుతామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణి గండన్, నాయకులు సుధాకర్ రెడ్డి, రెడ్డప్ప నాయుడు, సరిత, ఏకాంబరం, పార్థసారథి, గణేష్ కుమార్, వంశీ కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

యానాదుల భూములకు పట్టాలు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సోమల మండలం వలిగట్ల పంచాయతీ ఏ గొల్లపల్లిలో యానాదుల భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం కలెక్టర్‌కి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30సంవత్సరాల నుంచి యానాదులు అనుభవంలో ఉన్న భూములను నిరంతరం కబ్జాలకు పాల్పడుతూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వెంటనే వారికి పట్టాలిచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీరి అనుభవంలో ఉన్న భూములు గతంలో వేరుశనగ పంట పండించే వారిని ప్రస్తుతం మామిడి చెట్లు పెట్టి స్థలాన్ని కాపాడకుండా ప్రయత్నం చేస్తుంటే కబ్జాదారులు నిరంతరం గొడవ పడుతూ ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. యానాదులైన పార్వతమ్మ వారి కుటుంబ సభ్యులందరూ అక్కడ పొలం పనులు చేయిస్తూ కాపాడుకుంటున్నాప్పటికీ ఎప్పుడు ఎవరు వచ్చి దౌర్జన్యం చేస్తారో అని భయాందోళన గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తహశీల్దారు వెంటనే స్పందించి యానాదుల భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

- ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్తున్నప్పటికీ ఉచిత ఇసుక పాలసీ జిల్లాలో అమలుకావడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం కలెక్టర్‌కు విన్నవించారు. నగిరి నియోజకవర్గంలో విజయపురం, నగరి మండలాల్లో ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్న ఎవరు పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. ట్రాక్టర్లతో తరలిస్తూ ఇష్టారాజ్యంగా వేలకు వేలు వ్యాపారం చేస్తున్న రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎవరైనా ప్రజలు అడ్డుకుంటే వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా మాకు సంబంధం లేదని వ్యవరిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని, అక్రమ మార్గంలో వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: శాంతిపురం మండలం శెట్టిగాని కురబూరు గ్రామకు చెందిన 13 ఏళ్ల రజక బాలికను అత్యాచారానికి పాల్పడ్డ వాలంటరీ వెంకటాచలంను కఠినంగా శిక్షించాలని రజక సమాఖ్య సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు షణ్ముగం డిమాండ్ చేశారు. బాలిక కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలంటరీ వెంకటాచలం అభం శుభం తెలియని 13ఏళ్ల రజక కులానికి చెందిన బాలిక పాఠశాలకు వెళ్లి వస్తుండగా అత్యాచారానికి పాల్పడి తల్లిని చేశాడని ఆవేదన చెందారు. అతనిపై కేసు నమోదు చేయాలని కుప్పం డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారని అయితే బాలికకు అన్ని విధాలుగా ప్రభుత్వం నుంచి సహాయం అందించాలన్నారు.

అమరుల త్యాగం అజరామరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరులను స్మరించుకోవడం మన భాధ్యత అని, వారు చేసిన త్యాగాలు, సేవలు మరువలేనివని చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమ రావు, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. జిల్లా జడ్జి భీమ రావు మాట్లాడుతూ పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకుంటామన్నారు. ప్రజాశ్రేయస్సు, శాంతి భద్రతలే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా పోలీసులు తమ ప్రాణాలను అడ్డుపెట్టి విధులు నిర్వహిస్తున్నారని, పోలీసులకు ప్రజల సహకారం చాలా అవసరం అన్నారు. జిల్లాలోని పోలీసులు అండగా ఉంటూ అనేక రకాలుగా వారిని ఆదుకుంటామన్నారు. పోలీసులు పడుతున్న కష్టాన్ని శ్రమను గుర్తిస్తే వారికి అదే సంతోషం ఇస్తుందన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకోవడం మన బాధ్యతన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం అన్నారు. శాంతి భద్రతల కట్టడిలో పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తున్న పోలీసులను సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న పోలీసు దళాలపై జరిగిన దురదృష్టకర సంఘటనను గుర్తు చేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకోవడం ఎంతో ప్రాముఖ్యత కలిగినదని అన్నారు. దేశానికి, సమాజానికి పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకోవడం ద్వారా వారి ధైర్యం, శ్రేయోభిలాషతను గౌరవిస్తున్నామని అన్నారు. అమరవీరుల త్యాగాలు భారతదేశం కోసం ఇచ్చిన అత్యున్నత సేవల కిందకు వస్తాయని, వారి స్ఫూర్తిని ప్రతి ఒక్కరం మదిలో దాచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీసులు సమాజంలో శాంతి భద్రతలు నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారి త్యాగాల స్మరణే మన బాధ్యత అని ఆయన సూచించారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ కోసం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ ప్రేరణాత్మకమని, వారి స్ఫూర్తితో పోలీసు శాఖ నిరంతరం ప్రజల కోసం సేవలందిస్తుందన్నారు. అమరవీరుల సంస్మరణ ద్వారా ప్రతి ఒక్కరికి దేశభక్తి, విధిపట్ల నిబద్ధత, సేవాభావం వంటి విలువలు తక్కించుకోవాలని ఎస్పీ అన్నారు. "పోలీసులు దేశ రక్షణకు సమానమైన సేవలను అందిస్తారు. వారి ప్రాణాలు అర్పించడం వల్లే సమాజంలో శాంతి భద్రతలు కాపాడబడుతున్నాయి" అని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరులు చూపిన ధైర్యం, క్రమశిక్షణ ప్రతి ఒక్క పోలీసు సిబ్బందికి ఆదర్శప్రాయమని, వారు చూపిన మార్గంలో కష్టాలను తట్టుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. పోలీసు శాఖ నిస్వార్థంగా పనిచేసే సేవా భావం, ధైర్యసాహసాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల భద్రత, శాంతి స్థాపనకు కట్టుబడిన వారని స్పష్టం చేశారు. అదే విధంగా, పోలీసు అమరవీరుల స్మారక స్థూపాలకు ప్రతి ఒక్కరూ ఆరాధనగా నివాళులు అర్పించాలన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా

- తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యత
- నగర పాలక కమిషనర్ నరసింహప్రసాద్



నగర కమిషనర్, నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని ప్రధాన సమస్యలే అజెండాగా చిత్తూరు నగర పాలక సంస్థ పని చేస్తున్నట్లు నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. రెండు లక్షలకు పైగా జనాభా 78వేల ఆవాసాలు కలిగిన చిత్తూరు నగర పాలక సంస్థ 50డివిజన్లలో ఏర్పాటు చేసి దాదాపు అన్ని డివిజన్లలోని ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుసుకుంటునట్లు వివరించారు. గతంలో వర్షాల సందర్భంగా నీవా నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, గత వర్షాల సందర్భంగా దాదాపు 200కుటుంబాలు ఆవాసాలు నీటి మునిగినట్లు గుర్తించామన్నారు. ఎన్‌టిఆర్ జలాశయం నుంచి నగరంలోకి కొన్ని ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్నాం. చిత్తూరు ఎంఎల్ఏ, కార్పొరేటర్ల సహకారంలో నగరంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతోందని చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు.

ప్రజాశక్తి: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

కమిషనర్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య అక్కడక్కడా తలెత్తుతోంది. చిత్తూరు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు 19బోరుపాయింట్లు గుర్తించి బోర్లు వేస్తున్నాం. అలాగే నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు నగర పాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం జరుగుతోంది. అడవిపల్లి రిజర్వాయర్ పనులు 75శాతం పూర్తి చేయడం జరిగింది. పెండింగ్ పనులు పూర్తి చేస్తే చిత్తూరుకు తాగునీటి సమస్య పూర్తిగా తీరిపోనుంది.

ప్రజాశక్తి: చెత్తపన్ను వసూలు చేస్తున్నారా..?

కమిషనర్: చెత్తపన్ను ప్రభుత్వం రద్దు చేసింది. నగరంలో ఎక్కడా చెత్తపన్ను వసూలు చేయడం లేదు. నగర సుందరీకరణలో భాగంగా ఎక్కడా పారిశుధ్యం లోపం లేకుండా చర్యలు తీసుకుటున్నాం. పారిశుధ్య కార్మికులు 197మంది పని చేస్తున్నారు. అదనంగా పారిశుధ్య కార్మికులను నియమించుకోవాల్సిన అవసరముంది. డపింగ్ యార్డులో వర్మీకంపోస్టు తయారీ చేస్తున్నాం. అలాగే ప్రజల్లో పారిశుధ్యంపై అవగాన కల్పించి ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తొలగించడం జరుగుతోంది.

ప్రజాశక్తి: రోడ్ల విస్తరణ ఎప్పటిలోగా చేపడుతారు..?

కమిషనర్: ప్రధానంగా నగరంలో రోడ్ల విస్తరణ సమస్యగానే ఉంది. కట్టమంచి నుంచి కొత్త కలెక్టరేట్ వరకు, ఎంఎస్ఆర్ సర్కిల్ నుంచి కాజూరు వరకు ఫోర్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపడం జరిగింది. త్వరలో రోడ్ల విస్తరణ చేపట్టడం జరుగుతుంది.

ప్రజాశక్తి: నగర సుందరీకరణ ఎంత వరకు వచ్చింది..?

కమిషనర్: నగర పాలక సంస్థ పరిధిలో పార్కుల అభివృద్ధిలో భాగంగా ఎంఎస్ఆర్ సర్కుల్‌లోని మున్సిపల్ పార్కును సుందరీకరణ చేశాం. అలాగే కట్టమంచి చెరువు, గంగినేని చెరువు సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేశాం. నగరంలో రోడ్లకు ఇరువైపులు మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నాం. చర్చి వీధిలో పుట్‌ఫాత్‌పై విక్రయాలను నిషేదించడంతో కొంత ట్రాఫిక్ సమస్య తీరింది. ప్రధాన వీధుల్లో రోడును అక్రమించుకొని మురికి కాలువలకు ఇబ్బందిగా ఉన్న నిర్మాణాలను నగర పాలక సంస్థ కూల్చివేసి తిరిగి నిర్మాణం చేయకుండా ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: మురికి కాలువ సమస్యను ఎలా పరిష్కరిస్తారు..?

కమిషనర్: చిత్తూరు నగరంలో చినుకు పడితే మురుగు నీరు, వర్షపు నీరు పారేలా కాలువలు లేకపోవడంతో చర్చివీధి, పొన్నిమ్మగుడి వీధితో పాటు కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు, మురిగి నీరు వస్తోంది. ఎప్పుడో పురపాలిక ఏర్పాటు చేసిన నాటి కాలువలే కావడంతో ఇబ్బంది తలెత్తుతోంది. అండర్ డ్రైనేజి మంజూరు కావాల్సి ఉంది. ప్రధాన మురికి కాలువలను ఆదునీకరించి వర్షపు, మురికి నీరు నీవా నదిలో కలిసేలా చర్యలు చేపడుతున్నాం.

ప్రజాశక్తి: నీవా నది ముంపు నుంచి ప్రజలను కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

కమిషనర్: ఇటీవల కురుస్తున్న వర్షలతో ముందస్తు చర్యల్లో భాగంగా నీవా నదిలో జేసిబిల ద్వారా వ్యర్థాలను తొలగించడంతో పాటు వర్షపు నీరు పారేలా లోతు పెంపడం జరిగింది. నీవానది పరిసర ప్రాంతాల్లో కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఇరువారం నుంచి కట్టమంచి వరకు నదికి ఇరువైపులా గోడను నిర్మించాలని నిర్ణయించాం.

సన్మానం



ఏపీఎంను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలో నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెలుగు ఏపీఎం, సీఐలను సోమవారం వేర్వేరుగా కలిసిన టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏపీఎం ఫరీద్ మస్తాన్, జీడీ నెల్లూరు సీఐ లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నియాజ్‌అలి, జీవరత్నం, శాంతకుమార్, సంపత్, మహమ్మదాలి, వహిదాలి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎస్‌జిఎఫ్ అండర్ 17 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు దాదాపు 23 పాఠశాలకు సంబంధించి 130 మంది విద్యార్థులకు చిత్తూరు మెసానికల్ గ్రౌండ్ వేదికగా ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఎన్ యజ్ఞ, సాయి, ప్రణీశ్వర్ ఎంపికయ్యారు. వీరు వెస్ట్ గోదావరి జిల్లా మాటేరులో ఈనెల 26, 27, 28న జరిగే రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పిఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి కృష్ణబాబు శిక్షణ ఇచ్చిన పీఈటి అరవిండ్‌ని, విద్యార్థులను అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీలలో తప్పక విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఎంపీడీవోగా రెడ్డి బాబు బాధ్యతలు స్వీకరణ



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి ఎంపీడీవోగా ఎన్ రెడ్డిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తించారు. ఆయనకు ఉద్యోగోన్నతి లభించడంతో ఉన్నతాధికారులు ఆయనను ఇక్కడే ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో త్యాగరాజు రెడ్డి, పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహశీల్దార్ లోకనాథ పిళ్లై తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

గంగమ్మ ఆలయంలో కుంభాభిషేకం

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం పరిధిలోని బెవనపల్లిలో నూతనంగా నిర్మించిన ఊరి గంగమ్మ ఆలయ కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా వేద పండితులతో హోమం ఏర్పాటు చేసి చండీ హోమం, ప్రతిష్టాపన హోమం సాంప్రదాయ పద్దతిలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి మున్సిపల్ అధ్యక్షులు రాజ్ కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ సభ్యంద్ర శేఖర్, గ్రామ పెద్దలు కుంభాభిషేకం కలిశాలను ఆలయ గోపురంపై తీసుకెళ్లి, పూజా కార్యక్రమం నిర్వహించి, కుంభాభిషేకం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయ గర్భ గుడిలో అమ్మవారిని ప్రతిష్టాపన చేసి పండితులతో ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన చేపట్టారు.

ఘనంగా మాజీ ఎంపీ వర్ధంతి వేడుకలు



ప్రజాశక్తి-తవణంపల్లి: మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 27వ వర్ధంతి వేడుకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దిగువమాఘంలో రాజన్న మెమోరియల్ పార్క్‌లో అమర రాజా వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర రాజా మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవిలు మాజీ ఎంపీ రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి, మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్ళపల్లి, యల్లంపల్లి సురేష్, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసువులు తీసిన అక్రమ మైనింగ్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణం రెండవ వార్డు చీకలపల్లి రెవెన్యూ పరిధిలో చోటు చేసుకున్న ఘటనలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు క్షతగాత్రులుగా మారి స్థానిక పిఇఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ఒక్కరోజు ఆలస్యంగా వెలుగు చూసింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చీలేపల్లి పరిధిలో ఉన్న గుట్ట పోరంబోకు అయినా చిన్నపందిగుట్ట ప్రాంతంలో కొంతమంది స్థానికులు అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇది గమనించిన స్థానిక రెవెన్యూ అధికారులు గత మూడు మాసాలకు ముందు అక్రమ మైనింగ్ అడ్డుకోవడం జరిగిందన్నారు. అయినా వెనకకు తగ్గని అక్రమార్కులు చాకచక్యంగా అధికారుల కళ్ళు గప్పి తమ అక్రమ మైనింగ్‌ను కొనసాగిస్తూ, అక్రమార్జనకు అలవాటు పడ్డట్టు తెలిపారు. ప్రభుత్వ సెలవు రోజు అయిన ఆదివారం అక్రమార్కులు తమ మైనింగ్ పనులను నిర్వహించినట్టు తెలిపారు. ఈ క్రమంలో గుడుపల్లి మండలం కనమనపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్, తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా వట్నంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు మరో వ్యక్తి రాతి పనులకు రావడం జరిగిందని, ఇందులో భాగంగా రాతిని చీల్చడానికి పేలుడు పదార్థాలను సైతం వినియోగించినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా రాతిని చీల్చే క్రమంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలు పాలు కాగా వారిని వైద్య చికిత్స నిమిత్తం పిఈఎస్ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. అయితే కనుమలపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం బెంగళూరులోని నారాయణ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ వేణుగోపాల్ మృతి చెందగా మిగిలిన ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. ఇది ఇలా ఉండగా అక్రమ మైనింగ్‌పై అధికారుల పర్యవేక్షణ లోపించిన కారణంగానే నేడు నిండు ప్రాణాలు పోయాయంటూ పలువురు సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుప్పం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలతో పాటు సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

నిస్వార్థ శ్రామికులు పోలీసులే: సీఐ మహేశ్వర్



ప్రజాశక్తి-విజయపురం(నగరి): ప్రజల కోసం పోరాడుతూ అమరవీరులైన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యతని, నిస్వార్థ శ్రామికులుగా పోలీసులు సేవలు అందిస్తున్నారని నగరి సీఐ మహేశ్వర్ అన్నారు. నగిరి సీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం నిర్వహించారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వివిధ రకాల నేరాలు పెరిగిపోతున్నాయని, నేరాల నివారణకు స్వీయ నియంత్రణ చాలా అవసరం ఉందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తుపాను, కరోనా కష్ట కాలంలో పోలీసులు అందించిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. సమాజ రక్షణ, భద్రత కోసం పోలీసు సిబ్బంది అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. విధినిర్వహణలో అమరుల త్యాగాలు ప్రతిఫలం గుర్తుగా వారి కుటుంబాలకు ఘనంగా సన్మానించి జ్ఞాపకాలను అందజేశారు. కార్యక్రమంలో సూర్య కళాశాల టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



ప్రజాశక్తి-పలమనేరు: పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలుర, ఉర్దూ హైస్కూల్లో పలమనేరు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ లిఖిత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం వేళల్లో అందించే వంట గదులను పరిశీలించారు. అలాగే నిత్యవసర సరుకులు నిల్వ ఉన్న గదిలో బియ్యం, కోడి గుడ్లులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనాలు పరిశుభ్రంగా వండి రుచిగా విద్యార్థులకు అందించాలని అక్కడ సిబ్బందికి తెలిపారు. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలను చేపట్టామని జడ్జ్ లిఖిత పేర్కొన్నారు. పలమనేరు బార్ అసోసియేషన్ లక్ష్మీపతి. సీనియర్ న్యాయవాది భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అక్రమ సంబంధం వద్దని చెప్పిన భర్తపై కిరోసిన్ పోసి నిప్పంటించి అతి కిరాతకంగా హత్య చేసిన గోవిందమ్మ అనే మహిళకు జీవిత ఖైదు విధిస్తూ సోమవారం చిత్తూరు జిల్లా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. పాలసముద్రం మండలం, నరసింహాపురం గ్రామంలో కాపురం ఉన్న లేట్ గణేష్ భార్య మల్లికా తన కుమారుడు పేరు మునివేలుకు 12 సంవత్సరాల క్రితం తన కుమారుడు మునివేలుకు అదే గ్రామానికే చెందిన కృష్ణారెడ్డి కుమార్తె గోవిందమ్మను వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు పేరు నంద కుమార్. అతను తిరుమలరాజపురం హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. మల్లికా ఆమె కుమారుడు కోడలు మరియు మనవడు అందరం ఊరి బయట గల వారి పొలంలోని పెంకుటిల్లు లోనే కాపురం ఉండే వారు . పెళ్ళైనప్పటి నుండే ఆమె కోడలు భర్త మాట వినక ఇంటి పని, పొలం పని చేయక అడిగితే భర్తతో గొడవపడి వాళ్ళ అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయేది. అలా వెళితే 10, 15 రోజులపాటు తిరిగి వచ్చేదికాదు. ఇలా వెళ్ళినప్పుడు ఆమె కోడలు గోవిందమ్మ మా గ్రామంలోని మరియు చుట్టుప్రక్కల గ్రామాలలోని పలువురితో అక్రమ సంబంధం పెట్టుకొని వుండినది. ఇది తెలిసి భర్త మునివేలు పలుమార్లు ఆమెను దండించినప్పటికీ ఆమె తన పద్ధతి మార్చుకో కుండా చెడు తిరుగుడు తిరుగుతున్న కారణంగా మునివేలు కొన్ని సంవత్సరాలనుండి తాగుడికి బానిసై భార్యతో గొడవ పడి తన పద్ధతి మార్చుకోమని చెప్పే వాడు అప్పుడు గోవిందమ్మా వారి మాట లెక్క చేయక నేను ఇలానే వుంటాను, ఇదో ఒక రోజు నిన్ను చంపకుండా వదలను అని చెబుతుండేది. అంతే కాకుండా మునివేలు కు కొంత అప్పులు వుండటంతో ఆస్తిలో కొంత బాగాన్ని అమ్మే యాలని గత కొన్ని రోజులనుండి భేరమా డుతుం దినాడు. కాని గోవిందమ్మా ఆస్తి తన కుమారుడు నంద కుమార్ పైన రాసి వెయ్యాలని చెప్పడంతో భర్త మునివేలు భార్య గోవిందమ్మా తో తరచు గొడవపడేవారు .గోవిందమ్మా తన కుమారుడు నంద కుమార్ ను పిలుచుకొని తన పుట్టింటికి వేల్లిపోయినది. మల్లికా తన కుమార్తె మునేశ్వరి కి పెద్ద ఆపరేషన్ జరిగి వుండటంతో ఆమె తన కుమార్తె ఇంటికి వెల్లిపోగా . ఇంట్లో మునివేలు ఒక్కడే ఉండినాడు. అక్టోబర్ 17వ తేదీ 2017 ముని వేలును గోవిందమ్మ కిరోసిన్ పోసి నిప్పం టించి హత్య చేసింది. ఈ మేరకు కేసు పాలస ముద్రం స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి గోవిందమ్మ మొదటి ముద్దాయిగా చేర్చారు. ఈ కేసును విచారించిన అడిషనల్ డిస్టిక్ జడ్జ్ గోవిందమ్మకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది.

ఎర్రచందనం స్వాధీనం



ప్రజాశక్తి-పలమనేరు: అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పలమనేరు సీఐ నరసింహ రాజు తెలిపారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడిస్తూ.. గుడియాత్తం రోడ్డు సమీపంలో గల కాల్వపల్లి వద్ద అనుమానస్పదంగా కనిపించిన ఇన్నోవా కారును ఎస్ఐ స్వర్ణ తేజ తమ సిబ్బందితో కలిసి అడ్డుకునే ప్రయత్నంలో దుండగులు కారు వదిలి పరారైనట్లు తెలిపారు. కారును పరిశీలించగా 12దుంగలు స్వాధీనం చేసుకొని కారు సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'విష్ణు ది డెకర్స్' బ్రాంచ్ ప్రారంభం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విష్ణు ది డెకర్స్ పీవీసీ వాల్, సీలింగ్, త్రిడి డిజైన్స్ సంస్థ తమ రెండవ బ్రాంచిని సోమవారం ఉదయం గుడిపాల మండల క్రాస్‌లో ప్రారంభించింది. ఆ సంస్థ యజమాని హేమంత్ కుమార్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా సంస్థను ప్రారంభించారు. గుడిపాల క్రాస్ ప్రగతి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆ సంస్థ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు, భవన యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో చిత్తూరు నగరం కట్టమంచిలో విష్ణు ది డెకర్స్ పేరుతో తమ తొలి సంస్థను ప్రారంభించామన్నారు. నాటి నుంచి నేటి వరకు తమ డెకర్స్ సంస్థ చిత్తూరు నగరంతో పాటు యాదమరి, గుడిపాల మండలాలకు చెందిన భవన యజమానుల మన్ననలను విశేషంగా పొందిదన్నారు. ఈ క్రమంలో గుడిపాల మండల భవన యజమానుల కోరిక మేరకు, తాము గుడిపాల క్రాస్‌లో నూతనంగా మరో బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. తక్కువ లాభాపేక్షతో నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగించి భవన యజమానులు నచ్చేలా, మెచ్చేలా వారి గృహాన్ని అందంగా డెకరేట్ చేస్తామని పేర్కొన్నారు. చిత్తూరు నగరానికి వచ్చే పని లేకుండా గుడిపాల క్రాస్‌లోని తమ డెకర్స్ సంస్థ ద్వారా అందించే సేవలను గుడిపాల మండల పరిధిలోని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా ఈ కార్యక్రమంలో బాలాజీ రెడ్డి, జగదీష్, గిరిబాబు రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, శివ రెడ్డి, సిఎన్ఆర్ విద్యాసంస్థల అధినేత లోకేష్ రెడ్డి, మాస్టర్ స్కూల్ అధినేత హేమానంద రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

ప్రజాశక్తి-గుడిపాల: గత ప్రభుత్వంలో రీసర్వే చేసిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు గుడిపాల తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో తప్పొప్పులను సరిదిద్దడానికి రైతుల నుంచి అర్జీలు స్వీకరించబడుతుందని తెలిపారు. రైతులు తమ సమస్యలను గ్రామ సభలో తెలపవచ్చన్నారు. దీనిపై ముందస్తు దండోరా వేసి గ్రామసభ నిర్వహించి, రైతుల అనుమానాలు నివృత్తి చేస్తామన్నారు. మండలంలో ముట్టుకూరు పల్లి, పాపసముద్రం, వసంతాపురం, డిబి పల్లి, క్రిష్ణజిమ్మాపురం, బందార్లపల్లి, పశుమంద, చిత్తపార, నంగమంగళం, మరకాలకుప్పం, మొగరాలపల్లి, కుప్పిగానిపల్లి, లక్ష్మాంబ పురం మొత్తం 13రెవెన్యూ గ్రామాల్లో సభలు ఈనెల 22 నుంచి నవంబర్ 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఖోఖో అసోసియేషన్‌కు విరాళం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఈ నెల 25 నుంచి 27వరకు కాణిపాకంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 43వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఖోఖో ఛాంపియన్‌షిప్ (2024) నిర్వహణకు జిజెయం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా రూ.50వేల రూపాయల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తండ్రి సంస్థ నిర్వాహకులు గురజాల చెన్న కేశవులు నాయుడు అందించారు.

అక్రమ మద్యం పట్టివేత

- ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఒక్కరిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు.. మండలంలోని టేకుమంద గ్రామంలో వెంకటాచలం కర్ణాటకకు చెందిన 90ఎంఎల్ టెట్రా 82ప్యాకెట్లు ఇంట్లో ఉండడంపై అతనిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కర్నాటక నుంచి మద్యం తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ అస్గర్, కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- చదువులో వెనక పడ్డాడనే

ప్రజాశక్తి-పుంగనూరు: చదువులో వెనక పడ్డాడని మనస్థాపం చెంది పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ విద్యార్థి ప్రాణాపాయ స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం చికిత్స పొందుతున్నాడు. వివరాలు ఇలా.. పుంగనూరు మండలం లక్ష్మీ నాయక్ తాండకు చెందిన శ్రీకాంత్ కుమారుడు బి నరేంద్ర (17) పట్టణంలోని ఎన్‌డిఆర్ విశ్వ భారతి స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. చదువులో వెనుకంజులో ఉండడం పాఠశాలకు సక్రమంగా రాకపోవడంతో ఉపాధ్యాయులు అతని తల్లిదండ్రులు పిలిపించి ఉన్న విషయాలను చెప్పడం జరిగింది. తల్లిదండ్రులకు మీ కొడుకు సర్టిఫికెట్ ఇచ్చేస్తామని మీరు ఎక్కడైనా వేరే పాఠశాలలో చదివించుకోవాలని చెప్పారు. మీరు పాఠశాలకు ఫీజు బకాయి రూ.60వేలు ఉన్నదని ఈ డబ్బులు చెల్లించి టిసి తీసుకువెళ్లాలని చెప్పారు. దీంతో విద్యార్థి మనస్థాపానికి గురై ఇంటిలో ఉన్న పురుగుల మందులు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు



ప్రశంస పత్రాలు, మెడల్స్ అందుకున్న విద్యార్థులు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు తిరుపతిలో ఈనెల 20వ తేదీ ఆదివారం మహతి ఆడిటోరియంలో జరిగిన వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతీయ కళా ఉత్సవంలో పాల్గొన్నారు. నృత్య ప్రదర్శన చేసి ప్రశంసా పత్రాలు, మెడల్స్ సాధించారు. పాఠశాల హెచ్ఎం కుసుమాంబ, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలోని తెలుగు ఉపాధ్యాయురాలు కమలమ్మ పిల్లలకు నృత్యం నేర్పించి వారిని భారతీయ కళా ఉత్సవంలో పాల్గొనేలా చేసి అందరి ప్రశంసలు పొందడం తమకెంతో గర్వకారణంగా ఉందని సిబ్బంది అన్నారు. తెలుగు బోధన ఉపాధ్యాయురాలు కమలమ్మను సోమవారం ఘనంగా సన్మానించారు.

కరణంవారిపల్లిలో చిరుత సంచారం..?

- భయం గుప్పిట్లో గ్రామస్తులు





ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని కాకతీయ పంచాయతీ కరణంవారిపల్లిలో చిరుత సంచరిస్తున్నట్లుగా గ్రామస్తులు గుర్తించి భయాందోళన చెబుతున్నారు. గ్రామంలోని రాజమ్మ అనే మహిళ సోమవారం తెల్లవారుజామున గ్రామానికి సమీపంలోని తమ బోరుబావి వద్దకు వెళ్ళింది. ఓ మామిడి తోటలో చిరుత సంచరిస్తున్నట్లుగా అడుగులు ఉండడంతో గట్టిగా కేకలు వేసింది. వెంటనే గ్రామస్తులు తోటలోకి వెళ్లి చూడగా చిరుత దాని పిల్ల అడుగుజాడలు కనిపించాయి. దీంతో కరణంవారిపల్లి గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు ఏబిఓ రామయ్య, ఎఫ్‌బివో యువరాజులు సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. ఆ అడుగులు చిరుతవి కాదని హైనా లేకుంటే రేసు కుక్క అడుగులని వారు గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ కొందరిలో పులి భయం ఇంకా ఉంది.

యాదమరి - గుడియాత్తం రోడ్డు విషయంపై రాజీపడే ప్రసక్తే లేదు..

- ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు వేసి తీరుతా

- పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



ప్రజాశక్తి-యాదమరి: యాదమరి - గుడియాత్తం రోడ్డును పూర్తి చేసి తీరుతానని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ గారు హామీ ఇచ్చారు. సోమవారం యాదమరి మండలంలో పర్యటించి పల్లె పండుగ వారోత్సవాలకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పల్లె పండుగ వారోత్సవాలకు విచ్చేసిన ఆయనకు మండల నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని 155 కమ్మపల్లె, పత్రపల్లె, కృష్ణంపల్లె నడుమూరు, 184 – గొల్లపల్లె, బుడితరెడ్డిపల్లె, కొత్తపల్లి గ్రామాల్లో 43 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ల వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేశారు. గ్రామ గ్రామాన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్రహ్మణ్యం నాయుడు, మురార్జీ యాదవ్, వెంకటేష్ రబ్బీ, అమరనాథ్ నాయుడు, హేమగిరి చిట్టి, చిత్రా నాయుడు, గోపి గౌడ్, సర్పంచ్ హేమయ్య నాయుడు, సర్పంచ్ భగవతి, ధరణీ ప్రకాష్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది ఎక్కడ..?

- నామమాత్రంగా ముగిసిన మండల మీట్



ప్రజాశక్తి-పూతలపట్టు: విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామాల్లో కనిపించడం లేదు. సమస్యలపై ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. అధికారులు మండలంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను, గతంలో చేపట్టిన పనుల వివరాలను సమావేశంలో వివరించారు. మండల సమావేశం నామమాత్రంగా ముగిసింది. జెడ్పిటిసి దేవిక, ఎంపీడీవో నాగరాజు, వైస్ ఎంపీపీలు మురళి, ద్వారకనాథ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు నూతన బోరు



నూతన బోరుకు పూజ చేస్తున్న బాబు నాయుడు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని కస్తూర్బా పాఠశాలకు తాగునీటి సమస్య ఏర్పడింది. ఇటీవల కాలంలో ఉండటంతో ఈ విషయాన్ని మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి అధికారుల సహకారంతో సోమవారం నూతన బోరు వేయించారు. దీంతో కళాశాల ఉపాధ్యాయులు పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, నాయకులు హేమంబార్ గౌడు, సుబ్రమణి, చంద్ర, వెంకటాచలం, అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం పనులు పూర్తి



ప్రజాశక్తి-సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె సమీపంలోని పేటురుకు వెళ్లే మార్గంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన ప్రదేశంలో నూతన తాత్కాలిక వంతెన ఏర్పాటు సోమవారం పూర్తి కావడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. గార్గేయ నది ఉధృతంగా ప్రవహించి మూడుచోట్ల కల్వర్టులు వరద ఉధృతికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కలవట్లు కొట్టుకుపోవడంతో ఏడు గ్రామాలకు దాదాపు 600కుటుంబాలకు రాకపోకలు స్తంభించి రెండు రోజులపాటు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు, మండల స్థాయి అధికారులు సంఘటనా స్థలాలకు వెళ్లి పరిశీలించి వేగవంతంగా తాత్కాలిక కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించి అప్పటికప్పుడే పైపులను తెప్పించి పనులను శనివారం నుంచి ప్రారంభించారు. దీంతో శని, ఆది, సోమ మూడు రోజులు నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేసి తాత్కాలిక కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో భవనమంద బసవపల్లి వేటూరు తదితర గ్రామాలకు రాకపోకలు పునరుద్ధరించగా మిగిలిన గ్రామాలకు కూడా త్వరలో తాత్కాలిక కల్వర్ల నిర్మాణం చేపట్టి రాకపోకలు కొనసాగే విధంగా చేయనున్నట్లు అధికారులు అంటున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం పూర్తి చేసిన తాత్కాలిక కల్వర్టు నిర్మాణంతో తమ గ్రామాలకు రాకపోకలు కొనసాగుతున్నాయని ఇందుకోసం అహర్నిశలు కృషి చేసిన అధికారులకు కూటమి నేతలకు ఈ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.